# శ్రీరామ

- వేమూరి కృష్ణ






బాపూగారి సంపూర్ణ రామాయణం చూసాక (30 ఏళ్ళ క్రిందమాట) దాన్లో బాగా నచ్చింది. ఎస్వీరంగారావు, హనుమాన్ సుందరకాండ ఘట్టాలు. ఇంకా గుహుడికి ఘంటశాల గారు పాడిన పాట.

కొంత కాలం క్రితం (20 ఏళ్ళనుకుంటా) ముళ్ళపూడి వెంకటరమణ గారి కానుక కథ చదివాను. చాలా బాగా అనిపించింది.

ఈ రెంటి ప్రభావం ఈ కథ.

శృంగభేరిపురం. అయోధ్యకు దక్షిణాన్న ఉన్న ఒక నిషాద రాజ్యం. నిషాద రాజు గుహుడు కొలువు తీరి ఉన్నాడు. అప్పుడు చక్రవర్తి ధశరధ మహారాజు వద్ద నుంచి గుహుడికి వర్తమానం వచ్చింది. దాని సారాంశము.

"చక్రవర్తుల వారి జేష్ఠ కుమారుడైన శ్రీరామచంద్రమూర్తి కారణాంతరాల వల్ల వనవాసం వెళ్ళాలి అందుకు శ్రీరామచంద్రమూర్తిని గంగానది దాటించే బాధ్యతను చక్రవర్తులు తమ సామంతుడు గుహునికి అప్పగించటమైనది."

గుహుడు కర్తవ్యోన్ముఖుడైనాడు. అనుచరులను సరంగులను పిలిచి "రామయ్య తండ్రి మన రాజ్యం గుండా వనవాసానికి వెళతారంట. మనం రామయ్యని గంగానది దాటించాల. నావని సిద్ధం చేయండి గూడేన్ని అలంకరించండి ఈ విషయాన్ని మన గూడెం ప్రజలందరికి తెలిసేలా చాటింపే యించండి" అని చెప్పి తను ఏర్పాట్లను పర్యవేక్షించటానికి కదిలాడు.

గుహుడిలో రామయ్యకు తను నదిని దాటిస్తున్నాననే సంతోషం.. అంతలోనే రాముడ్ని వనవాసానికి పంపించటంలో తన పాత్రా ఉందన్న విషాదం. ఒక కంట పన్నీరు, ఒక కంట కన్నీరు. అయోధ్య చుట్టూ అడవులున్నా, దక్షిణాన ఉన్న దండకారణ్యానికి రాముడు వెళ్ళాలనుకోవటం తన అదృష్టమనుకున్నాడు. ఏమైనా రాముడు తన రాజ్యానికి రావటం, రాముడికి తను సాయం చేయటం తన పూర్వ జన్మ సుకృతమనుకున్నాడు గుహుడు.

గుహుడికీ రాముడికీ ఈ అనుబంధమేమిటి!? సామంతరాజుగా తను అయోధ్యకు చాలా సార్లు వెళ్ళాడు. రాముడు పుట్టినపుడు వెళ్ళాడు.

బోసినవ్వులతో అమాయకంగా కాళ్ళుచేతులు ఆడించే చిట్టి రాముడ్ని చూసినపుడు ఒకింత తన్మయత్వం చెందాడు. ఎందుకో రాముడి రూపు మనసంతా నిండిపోయింది. అప్రయత్నంగా కళ్ళుమూసుకున్నాడు. భగవత్సన్నిధానంలో ఉన్న అనుభూతి.

ఆరునెలల రాముడ్ని మళ్ళీ అన్న ప్రాశనలో చూసాడు గుహుడు.

అన్నప్రాశనలో బాల రాముడ్ని బోర్లా పడుకో పెట్టి ఎదురుగా చీని చీనాంబరాలు, బంగారు నగల, కిరీటం, ధనుర్భాణాలు ఉంచారు. చిన్ని రామయ్య పాకుతూ బాణాలు పట్టుకోవటం చూసాడు గుహుడు. దుష్టశిక్షణకు భువికేతెంచిన మహావిష్ణువులా కనిపించాడు బాలరాముడు గుహుడికి.

గుహుడు రామయ్య ఉపనయనానికి వెళ్ళాడు. గాయత్రీ ఉపదేశానంతరం వటువు రామయ్య భిక్షాటన చేస్తుంటే

రామయ్యలో వామనుడు త్రివిక్రముడై కనిపించాడు. భిక్ష వెయ్యాల్సిన తను సాగిలపడి రామయ్యకు మొక్కాడు.

రామయ్యకు పెళ్ళైన తర్వాత విందుకు వెళ్ళాడు గుహుడు. సతీసమేతుడైన రామయ్యను చూసి శ్రీ లక్ష్మీ సమేతుడై హరిని దర్శించాడు.

వెళ్ళిన ప్రతిసారి గుహుడుఏదో మధురానుభూతికి లోనౌతూనే ఉన్నాడు.

ఆ మధురానుభూతే భక్తి.. ప్రేమ..

✿✿✿✿✿✿

గుహుడి ఆజ్ఞ మేరకు ఒక ఝాములో గూడేన్ని అలంకరించారు. రహదారి నుంచి నావకు వెళ్ళే త్రోవను చదును చేసారు. తన దైవం రాముడు నడిచే త్రోవను గుహుడు పరీక్షిస్తున్నాడు. చేతితో తడిమి చూసి కొనదేలిన రాళ్ళను, ముళ్ళను ఏరి ప్రక్కన వేస్తున్నాడు. ఏడేళ్ళ చిన్ని గుహుడు ఇదంతా చూస్తున్నాడు. వాడికి తండ్రి చేసే పని వింతగా తోచింది కాని వాడికి వాళ్ళ నాన్నను ఏమని అడగాలో తెలీలేదు.

"అయ్యా బువ్వ తినడానికి రావే! అమ్మ పిలుస్తుంది" రామ ధ్యానంలో ఉన్న గుహుడికి కొడుకు మాటలు వినపడలేదు. చిన్ని గుహుడికి భయం వేసింది. పిలవగానే ఎత్తుకుని ముద్దాడే నాన్న ఎందుకిలా ఉన్నాడో అర్థం కాలేదు. అమ్మ దగ్గరకు పరుగు లంకించుకున్నాడు. జరిగింది ఏడుస్తూ భయపడుతూ వాళ్ళమ్మకు చెప్పాడు.

గుహుడి రామ పారవశ్యం గురించి గుహుడి భార్యకు తెలుసు అందుకే కొడుకు భయపడకుండా, వాణ్ణి గుండెలకు హత్తుకుని కారణం వివరించింది. "అబ్బులూ! మనగూడేనికి రాములోరు వత్తున్నారు. రాములోరంటే మీ అయ్యకు ఇట్టం. అందుకే మీ అయ్య రాములోరి కోసం ఆ పనులు చేస్తున్నాడు. "

ఈ విషయం గురించి వాళ్ళమ్మ వివరించకముందు ఎంత అర్థమయ్యిందో వివరించినాక అంతే అర్థమయ్యింది గుహుడి కొడుక్కి.

"రాములోరంటే అయ్యకెందుకే ఇట్టం?" వాళ్ళమ్మని అడిగాడు గుహుడి కొడుకు.

"రాములోరంటే అయ్యికెందుకిట్టమంటే..." గుహుడి భార్య ఆపైన చెప్పలేక "పద నాన్ననడుగుదువుగాని" అంది

గుహుడు కూడా ఎందుకో చెప్పలేకపోయాడు.

ఉద్వేగమో..

భక్తో...

ఆనందమో...

విషాదమో...

గుండె గొంతుకలోన కొట్లాడి కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యాడు. ఎందుకో చెప్పలేకపోయాడు. ఎదురుగా ఉన్న కొడుకుని చూసి రాములోరే అనుకున్నాడేమో...

కొడుకుని గుండెలకదుముకుని మహదానందంతో "రామా...! రామా...! " అని పలవరించసాగాడు.

చిన్ని గుహుడికి ఆ కౌగిలి నాన్న కౌగిలిలా అనిపించలేదు

"సిగ్గు..."

భయం

ఆశ్చర్యం

ఒక్కసారి వాడిని అలుముకున్నాయి వాడు వాళ్ళ నాన్నని విదిలించుకుని దూరంగా పారిపోబోయాడు. గుహుడు ఇహంలోకి వచ్చాడు. కొడుకు పరిస్థితి చూసి వాడి రెండు బుజాలు పట్టుకుని ప్రేమగా ముద్దాడాడు.

ఈ ముద్దులో చిన్ని గుహుడు వాడికి తెలిసిన నాన్నని చూసాడు సంతోషంతో అమ్మ వైపు తిరిగి నవ్వాడు. గుహుడి భార్య గుహుడి వైపు ఆరాధన పూర్వకంగా చూసింది. గుహుడు భార్యకి కళ్ళతోనే కృతజ్ఞత చెప్పి తన పనిలో పడ్డాడు.

దారిని సరిచేసుకుంటూ నావ వరకు చేరాడు గుహుడు.

సరంగులు వారి భార్యలు నావని కడిగి పసుపు రాసి బొట్లు పెట్టి పూజ చేసి పూల రథంలా అలంకరించారు.

గుహుడు చాల సంతోషించాడు.

అంతలోనే ఆ నావలో రామయ్య, సీతమ్మ కూర్చోబోయే బల్లని చేతితో తడిమి, పేడు లేదని నిర్ధారణ చేసుకుని, వొడ్డుకి వచ్చి ప్రక్కనే ఉన్న గంగమ్మ గుడికి సతీసమేతంగా వెళ్ళాడు. గంగమ్మకి పూజ చేసి మొక్కుకున్నాడు. "అమ్మా గంగమ్మా! దయగల తల్లివి! నావను నడిపే సరంగుని నేనే ఐనా రాములోర్ని అవతల వొడ్డుకి చేర్చేది నీవే తల్లీ! మమ్మల్ని

చల్లంగా చూడాలి" అని గంగమ్మను వేడుకున్నాడు గుహుడు. వామనుడు త్రివిక్రముడైనపుడు, బ్రహ్మ విష్ణుపాదాలను కడగాలని తన కమండలంలోని నీటిని పోయగా, ఆ విష్ణుపాదోద్భవినైన నేను సాక్షాద్విష్ణుస్వరూపుడు రాముడ్ని నది దాటించటమా అనుకుని గంగమ్మ నవ్వుకుని గుహుడిని మనస్సులోనే ఆశీర్వదించింది.

✿✿✿✿✿✿

ఇంతలో ఒక సరంగు పరుగు పరుగున వచ్చి
"సామీ రాములోరి రథం కనుచూపుమేరకు వచ్చేసినాదయ్యా" అని చెప్పాడు.

మొదట గుహుడు
వెనక అతని భార్య
ఆ వెనుక గుహుడి కొడుకు
సరంగులు
ప్రజలు
ఒక్క ఉదుటన రహదారి చేరారు.
ఆశ్చర్యం!!
వచ్చింది రామయ్య కాదు
అయోధ్య!!
అయోధ్యే తరలి వచ్చిందన్నంతగా రాములోరి రథం వెనుక ప్రజలు... అయోధ్య ప్రజలు
చిన్నా
చితకా
ముసలి
ముతకా
అందరిలోనూ దైన్యం
తమ రాముడు అడవులకు వెడుతున్నాడని క్రూరమైన మృగాలలాంటి రాక్షసులుండే అరణ్యంలో రామయ్య ఎలా నిభాయించుకూంటాడోనని..
అంతలోనే
తాటకి లాంటి రాక్షసిని చంపిన రాముడు ఎక్కడైనా నిభాయించుకోగలడని వారికి వారే ధైర్యం చెప్పుకుంటున్నారు.



ఇలా రక రకాల భావాలతో ఎంత వారించినా రథం వెనక వచ్చిన జనసంద్రం...

రామయ్య రథం దిగాడు. ఆయన వెనుక సీతమ్మ తరువాత లక్ష్మయ్య, సుమంతుడు..

తమను అనుసరించిన ప్రజలకు అభివాదం చేసారు సీతా రామలక్ష్మణులు

తమపై చూపిస్తున్న అభిమానాన్ని తన తమ్ములైన భరత శత్రుఘ్నులపై కూడా చూపాలని రాముడు ప్రజలను అభ్యర్థించాడు.

ఇంతలో గుహుడు పాదాభివందనం చెయ్యబోగా రామయ్య వారించాడు.

ఈతను గుహుడు, శృంగభేరి పురం రాజు అని సుమంతుడు చెపుతుంటే తనకు తెలుసన్నట్టు సుమంతునికి సౌంజ్ఞ చేసి, గుహునికి నమస్కారం చేసాడు రామయ్య.

"రామచంద్రా గుహుడు మిమ్మలను గంగానది దాటిస్తాడు" అని సుమంతుడు రాముడికి చెప్పి గుహునికి పదమన్నట్టు సంజ్ఞ చేసాడు సుమంతుడు.

గుహుడు రామయ్యకు దారి చూపుతూ నది ఒడ్డుకు తీసుకు వెళ్ళి ప్రత్యేకంగా అలంకరించిన దిమ్మెపై సుఖాసీనులను చేసి చక్రవర్తుల గురించి, మహారాణుల గురించి, తమ్ముళ్ళు, మరదళ్ళ గురించి పేరు పేరునా కుశల ప్రశ్నలడిగాడు గుహుడు. వనవాసానికి కారణమడిగాడు.

రామయ్య మందస్మిత దరహాసం గుహుడికి సమాధానమయ్యింది.

సుమంతుడు గుహుడ్ని వారించి ఇక బయలదేరమన్నాడు.

గుహుడు రామయ్యని గంగమ్మ గుడికి తీసుకెళ్ళి మ్రొక్కించాడు.

ఇంటికొచ్చిన తండ్రి చేత మ్రొక్కించుకున్న గంగమ్మ చిన్నబోయింది. మనసులోనే జన్మ నిచ్చిన తండ్రికి మ్రొక్కింది.

సరంగులు
గుహుడు
రామయ్య
సీతమ్మ
లక్ష్మయ్య
అందరు నావనెక్కారు.

గుహుడు, సరంగులు గంగమ్మకు మళ్ళీ ఇంకొకసారి నమస్కరించి తెడ్డు వేసారు.

నావవేగాన్ని పుంజుకుంది

కొంతదూరం పోయాక, రామయ్యనే చూస్తూ మైమరిచిన గుహుడు తదాత్మ్యంలో తెడ్డు వేయటం మరిచాడు.

తమ నావికుడు తెడ్డువెయ్యటం ఎందుకు ఆపాడో అనుకుని, మిగిలిన సరంగులు తెడ్డు వెయ్యటం ఆపేసారు.

నావ నీటివాలుకు వెళ్తూంది.

ఇది గమనించిన రామయ్య గుహుడ్ని చేతన పరిచాడు.

సిగ్గుపడి గుహుడు మళ్ళీ తెడ్డు వేసాడు.

సరంగులు గుహుడ్ని అనుసరించారు.

అప్పటి వరకు సుడులు తిరుగుతూ పరవళ్ళు తొక్కుతూ హొయలు పోయే గంగమ్మ, లోకకల్యాణం కోసం తనను దాటుకుంటూ వెళ్ళే రామయ్యకి సాయం చేసే గుహుడి కోసం నిలకడగా ఉండసాగింది.

సరంగులను ఉత్సాహ పరచటానికి గుహుడు గొంతెత్తాడు. కొండంత భావం గోరంత బాషలోకి బడి అతనికి తెలుసున్న రాగంలో

"రామయ్య ఓ సీతారామయ్య హైలెస్సా"

"తాటకాంతక రామయ్య ఓ సీతారామయ్య"

రామయ్య పాట వింటూ ఉలిక్కి పడ్డాడు. తను గుహుడికి ఏమౌతానని ఇలా ఆరాధిస్తున్నాడో తెలుసుకోవాలనుకున్నాడు జగన్నాటక సూత్రధారి!

నావ ఆవలి ఒడ్డుకు చేరింది.

సరంగులు దిగి నావను ఒడ్డుకు దగ్గరగా లాగి ఒక చెట్టుకు కట్టారు.

గుహుడు దిగాడు.

తరువాత రామయ్య లేవబోయాడు. నావలోని కీలకు రామయ్య పంచె తగుల్కొని, రామయ్య ముందుకు తూలాడు. బరువు కాసుకోవటంలో రామయ్య కాలి బొటన వేలు చిట్లి రక్తస్రావమైంది.

గుహుడు విలవిల్లాడిపోయాడు

పరుగున నావలోకి చేరి తన ఉత్తరియాన్ని చింపి వేలికి కట్టి కళ్ళ నీళ్ళ పర్యంతమై క్షమించమని వేడుకున్నాడు.

రామయ్య గుహుడ్ని ఓదార్చాడు.

తరువాత అందరూ ఒడ్డుకు చేరారు.

'రామయ్య తండ్రి... పద్నాలుగేళ్ళు అయింతర్వాత నా నావలోనే ఈ ఒడ్డు నుంచీ ఆ ఒడ్డుకు చేరాల. నా తప్పులు దిద్దుకునే అవకాశం ఇయ్యాల!' అని ప్రాధేయపడ్డాడు.

గుహుడ్ని రాముడు దగ్గరకు తీసుకుని కౌగలించుకున్నాడు.

గుహుడిలోని కలకలం తగ్గింది. గుహుడికి వీడ్కోలు చెప్పి దండకారణ్యానికి తరలిపోయారు సీతా రామ లక్ష్మణులు. రామయ్యను కనుచూపు మేరా దాటే వరకూ చూసి ఆపై నిర్రాడైపోయిన గుహుడ్ని తట్టి ఇహలోకంలోకి తెచ్చారు సరంగులు.

గుహుడి కళ్ళవెంట ధారాపాతంగా నీళ్ళు..

సీతారామలక్ష్మణుల్ని గంగానది దాటించానని సంతోషం అంతలోనే వాళ్ళను వనవాసం పంపటంలో తన పాత్రా ఉందని విషాదం.. అంతకు మించి రామయ్యకు తన నావ వల్ల అపాయం జరిగిందని బాధతో నావ వద్దకు వచ్చాడు

నావ

తనకు బ్రతుకునిచ్చిన నావ

"దీని వల్లే రామయ్యకు దగ్గరయ్యాను

దీని వల్లే రాముడికి గాయం అయింది."

బాధతో కొట్టు మిట్టాడుతున్న గుహుడ్ని నావలో కూర్చోబెట్టి ఈవల ఒడ్డుకు చేర్చారు.

✿✿✿✿✿✿

చేసిన తప్పును దిద్దుకోవాలని గుహుడు ఇంటికి వెళ్ళకుండా గంగమ్మ గుడివద్దే ఆలోచిస్తూ కూర్చున్నాడు గుహుడు. "రామయ్య తిరిగొచ్చేలోగా ఇంకో నావను చెయ్యాలి తనొక్కడే దానిమీదే రామయ్యను ఇవతల ఒడ్డుకు తేవాలి" అనుకున్నాడు.

✿✿✿✿✿✿

ప్రొద్దుటే లేవటం అడవికెళ్ళి చెట్లు నరికి కలప తీసుకురావటం. చెక్కలుగా చేయటం. ఏమాత్రం సుడులున్నా

కలపని పడవేయటం. ఏర్రాత్తో కొడుకుగానీ, భార్యగానీ పెట్టిన తిండి తినటం... నది ఒడ్డుని నిద్రపోవటం. ఇంటికి రమ్మన్నా రాకపోవటం... నావ తయారయ్యాక ఏ మాత్రం తేడా కనిపించినా నదిలోకి తోసెయ్యటం. రామయ్యకు తగిన నావను చెయ్యాల. ఈ సారి నావ రామయ్యకు ఏ చిన్న కష్టం కలిగించకూడదు. రామయ్య కోసం నావలు తయారు చేస్తూనే ఉన్నాడు.

తయారైన ప్రతీ నావకీ ఆనందం. తను రామయ్య కోసం చేయబడుతున్నామని... అంతలోనే భయం. గుహుడికి తను నచ్చకపోతే నదిలోకి తోసేస్తాడని.

గుహుడు పద్నాలుగేళ్ళుగా రామయ్యకు నచ్చేలాగా నావను తయారు చేయటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

పద్నాలుగేళ్ళు నిండాయి.



గుహుడి నావ తయారు కాలేదు. ఈ రోజే రామమయ్య రావాలి అని నావను మెరుగులు దిద్దుతూనే ఉన్నాడు.

గుహుడి కొడుకు పరుగున వచ్చి "అయ్యా రాములోరు అయోధ్యకు వచ్చేసారంట. ఎగిరే పల్లకిలోనే. వినగానే గుహుడు స్పృహ తప్పి పడిపోయాడు. గంగ నీరు తీసుకువచ్చి గుహుడి మొహం మీద చల్లాడు కొడుకు. స్పృహ వచ్చిన గుహుడికి చెప్పాడు

"అయ్యా నీకంతా తొందరేనే. చెప్పేదంతాఇనవు. రాములోరు పట్టాభిషేకానికి నిన్ను తీసుకురమ్మన్నారంట. రథాన్ని పంపించారు"

గుహుడి ఆనందానికి అవధులులేవు.

పద్నాలుగేళ్ళుగా తను చేసిన పిచ్చిపని గుర్తుకొచ్చింది. ఆ ఒడ్డునా ఈ ఒడ్డునా నదిపైనా నదిలోనూ ఉన్న రామయ్యను తను దాటించాలా..! తన కర్మ పరిపక్వత కోసం నిరంతరం భగవధ్యానం చేసేలా ఆ రామయ్య తన చేత ఇలా చేయించాడనుకున్నాడు.

❖❖❖❖❖❖

అయోధ్య చేరిన గుహుడ్ని సాదరంగా ఆహ్వానించాడు రాముడు. కుశలమడిగాక "నాకంతా తెలిసింది, మీరు తయారు చేసిన నావలో విహార యాత్రకు సీతా సమేతంగా త్వరలో వస్తాను" అన్నాడు రామయ్య.

పట్టాభిషేకమయ్యాక మనసంతాఆ రాముడ్నే నింపుకుని తన పురం చేరి రాముడి కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు గుహుడు తన నావతో సహా.

❖❖❖❖❖❖

చదివింది IISc బెంగుళూరులో. ప్రస్తుత ఉద్యోగం SRG Inc లో వైస్ ప్రెసిడెంట్‌గా. వేమూరి కృష్ణ గారు చక్కటి సాహిత్యాభిమాని.. ఒకప్పుడు విరివిగా కథలు రాసిన రచయిత